క్లుప్తంగా

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



పందలపాకలో ఫిర్యాదు స్వీకరిస్తున్న అధికారులు

బిక్కవోలు: మండలంలోని భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి తహసీల్దార్ కృష్ణ అన్నారు. మంగళవారం ఆయన పందలపాక పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. రెండు రోజుల పాటు ఈ గ్రామంలో సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వివిధ సమస్యలపై 64 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి సబ్బారపు పద్మావతి, ఉప సర్పంచి పడాల వెంకటరామారెడ్డి, పంచాయతీ వార్డు సభ్యులు, ఆర్ఐ రవికుమార్, వీఆర్వో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి



శిక్షణను సందర్శిస్తున్న సుబ్రహ్మణ్యం

రాజానగరం: ప్రాథమిక స్థాయి విద్యార్థులకు తరగతి వారీగా కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించవలసిన అవసరం ఉందని కోనసీమ జిల్లా సమగ్ర శిక్షా సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని కొండగుంటూరులో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణా తరగతులను మంగళవారం సందర్శించారు. 2026 నాటికి ఒకటి, రెండు తరగతుల విద్యార్థులందరికి చదవడం, రాయడం సంపూర్ణంగా రావాలనే ఉద్దేశంతో ప్రాథమిక విద్యా బోధన చేసే ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కోర్సు డైరెక్టర్ పి.రాంబాబు మాట్లాడుతూ ఆటపాటలతో కూడిన విద్యను అభ్యసించేందుకు ఇస్తున్న ఈ శిక్షణను ఉపాధ్యాయులు బోధనలో ఉపయోగించి, సత్ఫలితాలను అందుకోవాలన్నారు. రాష్ట్ర పరిశీలకుడు అరవ ప్రభాకర్ పాల్గొన్నారు.

సకాలంలో టీకాలు వేయాలి

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సుబ్బరాజు



ఆరోగ్య సిబ్బందితో డీఐఓ సుబ్బరాజు

పెదపూడి: గర్భిణులు, పిల్లలకు బాధ్యతగా సకాలంలో టీకాలు వేయించాలని ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బందికి కాకినాడ జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కె.వి.సుబ్బరాజు సూచించారు. పెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆశా డే సమావేశంలో పాల్గొన్నారు. గర్భిణులు, పిల్లలకు వేయాల్సిన టీకాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరించాలన్నారు. రక్తహీనతను ప్రాథమిక దశలోనే నివారించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డీహెచ్.ప్రత్యుష, ఎస్ఓ.వినయలక్ష్మి, ఏఎస్ఓ గిరి, గణేష్ పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్



సీతానగరం పోలీస్ స్టేషన్ వద్ద సీజ్ చేసిన ఇసుక లారీ

సీతానగరం: మండలంలోని కాటవరం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సీజ్ చేశామని ఎస్సై డి రామ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా సోమవారం అర్ధరాత్రి సీతానగరం వైపు నుంచి వెళుతున్న ఇసుక లారీని కాటవరం వద్ద నిలుపు చేసినట్లు చెప్పారు. అనంతరం లారీని సీతానగరం పోలీస్ స్టేషన్ వద్దకు తరలించారు. వాహనాన్ని మైన్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించినట్లు ఎస్సై చెప్పారు.

షాట్‌పుట్‌లో విద్యార్థి ప్రతిభ

పెదపూడి: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ షాట్‌పుట్ పోటీల్లో పెదపూడి గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన డీ.ఎల్.దుర్గా హరీష్ ఉత్తమ ప్రతిభ కనబరిచి నాల్గో స్థానం సాధించాడని ఆ పాఠశాల హెచ్ఎం ఎం.సత్యనారాయణ తెలిపారు. ఇటీవల రాష్ట్ర స్థాయి పోటీలు శ్రీకాకుళం జిల్లాలో జరిగాయన్నారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న దుర్గా హరీష్ అండర్–17 బాలుర విభాగంలో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించాడన్నారు. విద్యార్థిని ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కొనసాగిస్తారా.. సాగనంపుతారా!

- వలంటీర్ల సేవలపై నీలినీడలు
- నెలలు దాటుతున్నా సర్కారు మౌనం
- రూ.10వేల వేతనం ఉత్తుత్తిదేనా
- ఉద్యమ బాటే శరణ్యం

పెదపూడి: గత వైఎస్సార్ సీపీ పాలనలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పని చేస్తూ విశిష్ట సేవలందించిన వలంటీర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుటిల పన్నాగాలు పన్నుతోంది. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు దాటినా వలంటీర్ వ్యవస్థను సీఎం చంద్రబాబు డోలాయమానంలో ఉంచడమే ఇందుకు తార్కాణం. ఈ నేపథ్యంలో తమను కొనసాగిస్తారో.. లేక సాగనంపుతారో తెలియని అయోమయంలో వలంటీర్లు కొట్టుమిట్టుడుతున్నారు.

రూ.10వేల గౌరవ వేతనం మాటేమిటి..

నియోజకవర్గంలో ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్ చొప్పున గత వైఎస్సార్ ప్రభుత్వంలో మొత్తం 1,239 మందిని రిజర్వేషన్ల ప్రాతిపదికన నియమించారు. ఇందులో 50 శాతానికి తగ్గకుండా మహిళలకు ఉపాధి అవకాశం దక్కింది. వీరి సేవలకు గౌరవ వేతనంగా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నెల రూ.5 వేలు చొప్పున చెల్లిస్తూ వచ్చారు. గత ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే ప్రతి వలంటీర్‌కు నెలకు రూ.10 వేలు గౌరవ వేతనం చెల్లిస్తామంటూ కూటమి నేతలు చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, లోకేష్‌లు హామీ ఇచ్చారు. తీరా అధికారం చేపట్టిన తర్వాత వలంటీర్లను దూరం పెడుతూ వచ్చారు. వారికి ఇంతవరకు నాలుగు నెలల వేతనాలు అందలేదు.



బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

సచివాలయ ఉద్యోగులకు బాధ్యతలు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వలంటీర్లను పూర్తిగా పక్కన పెట్టి వారి బాధ్యతలను సచివాలయ ఉద్యోగులకు కట్టబెట్టారు. గడిచిన ఐదేళ్లలో ఒకటో తేదీ తెల్లవారక ముందే లబ్ధిదారుల ఇళ్ల తలుపులు తట్టి సామాజిక భద్రత పింఛన్‌లు అందజేయడంతో పాటు కరోనా విపత్కర సమయంలో అమూల్యమైన సేవలందించడంలో వలంటీర్లు తీసుకున్న చొరవ ఎనలేనిది. ప్రభుత్వ కార్యక్రమాల్లో వలంటీర్లు అప్పట్లో కీలకంగా మారారు. జగన్ సర్కార్ అమలులోకి తెచ్చిన 33 రకాల ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించారు. ఇంతటి గొప్ప వ్యవస్థకు శ్రీకారం చుట్టిన వైఎస్ జగన్‌కు అప్పట్లో దేశ వ్యాప్తంగా ప్రశంసలు దక్కాయి. ఈ విధానం అమలు చేసేందుకు చాలా రాష్ట్ర ప్రభుత్వాలు అధ్యయనం చేశాయి.

మండలం	వలంటీర్లు
అనపర్తి	438
బిక్కవోలు	434
పెదపూడి	367
రంగంపేట	370
మొత్తం	1239

తమకు ఉద్యోగ భద్రత కోరుతూ వలంటీర్లు రాష్ట్రంలో ఇప్పటికే పలు చోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అయినా ప్రభుత్వ పాలకుల తీరులో మార్పు రాకపోవడంతో పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వలంటీర్ల సంఘం నేతలు, వలంటీర్లు వెల్లడించారు.

నిబద్ధతతో పని చేశాం



వలంటీర్‌గా ఎంతో నిబద్ధతతో ఐదేళ్ల పాటు పని చేశా. నిరుద్యోగిగా ఇబ్బందులు పడుతున్న తరుణంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పుణ్యమా అని ఊర్లోనే చిరుద్యోగం దక్కించుకున్నా. అవినీతికి ఆస్కారం లేకుండా విశిష్ట సేవలు అందించాం. మా సేవలను సీఎం చంద్రబాబు గుర్తించి వలంటీర్ వ్యవస్థను తిరిగి కొనసాగించేలా చర్యలు తీసుకోవాలి.

– పీ.చిన్ని, వలంటీర్, పెదపూడి గ్రామం.

ఘనంగా గౌరమ్మ తల్లి సంబరం



జాతరలో ఆకట్టుకున్న శక్తి వేషాలు

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో ఐదేళ్లకు ఓసారి జరిపే గౌరమ్మ తల్లి సంబరాన్ని సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శక్తి వేషాలు, కేరళ నాట్యం, అగోరా నాట్యం, తీన్‌మార్ డప్పులు, బాణ సంచా పేలుళ్ల నడుమ అమ్మవారి గ్రామోత్సవం నేత్రపర్వంగా సాగింది. అమ్మవారిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్య నారాయణరెడ్డి తదితరులు దర్శించుకున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో గౌరమ్మ తల్లి

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు



బిక్కవోలు సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో భక్తుల పూజలు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద భారీ ఎత్తున అభిషేకాలు నిర్వహించారు. కార్తిక మాస మంగళవారంతో పాటు నాగుల చవితి పర్వదినం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలి వచ్చి అభిషేకాలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి భక్తులు రావడంతో క్యూలైన్లు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అర్చకులు సన్నిధి రాజు సుబ్రహ్మణ్య శర్మ, కొడమంచిలి సత్యనారాయణలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ ఈఓ రామలింగ భాస్కర్, ప్రసాద్, సిబ్బంది కార్యక్రమాలను పర్యవేక్షించారు.



సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

ఆధునిక సాంకేతిక విజ్ఞానంపై రైతులకు అవగాహన

రంగంపేట: వ్యవసాయంలో ఆధునిక శాస్త్ర సాంకేతిక విజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని గ్రామ ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు సూచించారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల అధ్యయన విద్యార్థులు రంగంపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆవరణలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు కళాశాల విద్యలో భాగంగా గ్రామంలో రైతులు ఆచరిస్తున్న వివిధ వ్యవసాయ పద్ధతులను తెలుసుకుంటూ నూతన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్తలు సి.హెచ్.ఎస్.వి. నరసింహారావు, ఎమ్.శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి కె.శ్రీనివారావు, వ్యవసాయ సహాయకుడు కె.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేలు అందజేత

మధురపూడి: కార్తికమాసం సందర్భంగా కోరుకొండలో కొలువు దీరిన శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో అన్న సమారాధన నిమిత్తం బీజేపీ రాజానగరం నియోజకవర్గ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి రూ.50 వేలు వితరణ చేశారు. చాలా కాలంగా స్వామివారి ఆశీస్సులతో రాజకీయాల్లో కొనసాగుతున్నట్టు ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సమావేశంలో నెలంతా భక్తులకు నిత్యాన్నదానం నిర్వహించాలని నిర్ణయించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురంలో పేకాడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి రామ్‌కుమార్ మంగళవారం తెలిపారు. రఘుదేవపురం గ్రామ శివారులో పేకాడుతుండగా దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 6,280లు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్ట్ చేసిన వారిలో రఘుదేవపురానికి చెందిన వారు ముగ్గురు, కోరుకొండ మండలం కోటికేశవరానికి చెందిన ఒక వ్యక్తి ఉన్నారన్నారు.

కార్తిక వన సమారాధన



ఆహ్వానితులను సత్కరిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

రాజానగరం: వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ కోఆర్డినేటర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ గూడూరి శ్రీనివాస్, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ గూడూరి రాధికల ఆధ్వర్యంలో దివాన్ చెరువులోని డీవీబీ రాజు లే అవుట్‌లో మంగళవారం కార్తిక వన సమారాధన జరిగింది. రాజకీయాలతో సంబంధం లేకుండా పలువురు నాయకులు, పెద్దలు, స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆహ్వానితులను డాక్టర్ శ్రీనివాస్ సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

డిమాండ్ల పరిష్కారానికి వినతి

రంగంపేట: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రంగంపేట 104 సిబ్బంది స్థానిక వైద్యాధికారిణి బి.వేణు శ్రీలక్ష్మికి మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకి మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, కుటుంబాలను పోషించడం కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ సొమ్ము తిరిగి చెల్లించాలన్నారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని కోరారు. యాజమాన్యం నుంచి రావలసిన ఇతర బకాయిలు చెల్లించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో 104 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేట్ల రాంబాబు, డ్రైవర్లు గొర్రెల కాంతారావు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు బత్తిన అనిల్‌కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



రంగంపేట పీహెచ్‌సీలో వైద్యురాలు వేణు శ్రీలక్ష్మికి వినతి పత్రం అందిస్తున్న 104 సిబ్బంది

మహిళల రక్షణకు ప్రత్యేక బృందాలు

పెదపూడి: మహిళల రక్షణ కోసం ప్రభుత్వం మహిళా రక్షక్ టీంలు ఏర్పాటు చేసిందని పెదపూడి ఎస్సై రామారావు తెలిపారు. మండలంలోని పెదపూడి గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, జి.మామిడాడ గమ్యం జూనియర్ కళాశాలల్లో ఎస్సై రామారావు మహిళ రక్షక్ టీం విద్యార్థులకు అవగాహన సమావేశాలు మంగళవారం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ రక్షక్ టీంలు ప్రతి రోజు మండలంలో తిరుగుతూ మహిళల రక్షణ కోసం పాఠశాలలు, గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పెదపూడి ఉన్నత పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఉదయ, గమ్యం కాలేజీ కరస్పాండెంట్ కర్రి శివారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ దొరబాబు, ఉపాధ్యాయులు జి.అనూష, ఎం.అనూష, ఎస్‌వీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెదపూడి పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్సై రామారావు

ఇసుక తవ్వకాలను అడ్డుకున్న కూలీలు

సీతానగరం: మండలంలోని వంగలపూడి ర్యాంపులో సోమవారం నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. వంగలపూడి ర్యాంపును ప్రభుత్వం అధికారికంగా మంజూరు చేసింది. ఇక్కడ నుంచి ఉచిత ఇసుకను ట్రాక్టర్లు, ఎడ్లబళ్లపై తీసుకువెళ్లవచ్చు. ర్యాంపు నిర్వాహకులు కూలీలతో ఇసుక తవ్వకాలు జరిపి ట్రాక్టర్లపై స్టాక్ పాయింట్ వద్దకు తరలించాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా పొక్లెయిన్‌తో ఇసుక తవ్వకాలు జరిపారు. దానితో కూలీలు తవ్వకాలను అడ్డుకుని ఇసుక లారీలు కదలకుండా అడ్డుకున్నారు. ర్యాంపు నిర్వాహకులకు, కూలీలకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పొక్లెయిన్‌తో ఇసుక తవ్వకాలు జరిపే విధంగా అనుమతులు తీసుకువస్తామని ర్యాంపు నిర్వాహకులు వెళ్లిపోయారు.



చక్రద్వార బంధంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



బూరుగుపూడి తోటల్లో నాగేంద్రుడికి పూజలు చేస్తున్న భక్తులు

నాగన్న.. మము చల్లంగ చూడన్నా..

- భక్తి శ్రద్ధలతో నాగుల చవితి
- కళకళలాడిన సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయాలు

రాజానగరం: నియోజకవర్గంలోని ప్రజలు మంగళవారం నాగుల చవితిని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తోటల్లో ఉన్న పుట్టల వద్దకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి పూజలు చేశారు. పాలు, కోడి గుడ్లు, చిమ్మిడి నైవేద్యాలుగా సమర్పించారు. చిన్నారులు, పెద్దలు బాణసంచా కాలుస్తూ సరదాగా గడిపారు. మండలంలోని జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న జీపీఆర్ గార్డెన్స్, ఆర్‌కె గార్డెన్స్, లాలాచెరువులోని రిజర్వు ఫారెస్టు ఏరియా, పుష్కర వనాలతో పాటు పల్ల కడియం, కానవరం, దివాన్ చెరువు, కనుపూరు, కొంతమూరు, గాడాల, శ్రీరామపురం, పాలచర్ల రోడ్ల సమీపంలో ఉన్న తోటల్లోని నాగుల పుట్టల వద్ద భక్తుల సందడి నెలకొంది. రాజానగరం, కానవరం, శ్రీకృష్ణపట్నంలలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయాలతో పాటు నరేంద్రపురంలోని త్రిమూర్తుల ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. కొంత మంది భక్తులు ఉసిరి చెట్ల వద్ద దీపాలు వెలిగించి దామోదరుని స్మరించుకున్నారు.



ముగ్గళ్ల శివాలయంలో సుబ్రహ్మణ్యేశ్వరుడిని దర్శిస్తున్న భక్తులు

నాగేంద్రుడికి విశేష పూజలు

మధురపూడి: కోరుకొండ మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం నాగుల చవితి పండగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పుట్టలను అందంగా అలంకరించారు. అందరి క్షేమం కోరుకుంటూ నాగేంద్రుడికి పూజలు చేశారు. ప్రసాదాలను సమర్పించారు. విమానాశ్రయం సమీపంలోని ఉద్యాన వనాలు, బొల్లెద్దుపాలెం, కణుపూరు, గాధరాడ, కోటి కేశవరం తదితర గ్రామాల్లో ప్రత్యేక సందడి నెలకొంది.

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి

బిక్కవోలు: నాగులచవితి పర్వదినాన్ని మంగళవారం మండలంలోని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. పలు గ్రామాల్లోని నాగుల పుట్టల వద్ద నోములు నోచుకొని మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి కోడి గుడ్లు, మొలకెత్తిన సజ్జలు, చిమ్మిడి తదితర పదార్థాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు. చిన్నారులు బాణసంచా కాల్చి సాయంత్రం వరకు సరదాగా గడిపారు.

సీతానగరం: గ్రామాల్లో నాగుల చవితి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పండగను పురస్కరించుకొని పంట పొలాల్లోని పుట్టలకు పసుపు, కుంకుమలతో పూజలు జరిపారు. ఉదయం 4 గంటల నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటాలాడాయి. సీతానగరం, ముగ్గళ్ల, మునికూడలిలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. స్వామివారికి అభిషేకాలు, పూజలు జరిపారు. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, సీతానగరం, చినకొండేపూడి, రఘుదేవపురం, ముగ్గళ్ల, కూనవరం, చీపురుపల్లి, నాగంపల్లి, అచ్యుయ్యపాలెం, ఇనుగంటివారిపేట, వెదుళ్లపల్లి, రాజంపేట, మునికూడలి, కాటవరం, బొబ్బిల్లంక, జాలిమూడి, ములకల్లంక, మిర్తిపాడు, ఉండేశ్వరపురంలోని ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.



ఆర్ఎస్ పేటలో నాగుల పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు